# నిష్కామకర్మ

రైల్లో ఎక్కి బెడ్డింగ్ పర్చాడు, మూడో తరగతి ప్రయాణీకులకు రైల్వేవారు చేసే సదుపాయాలు చాలవన్నట్టు కమలాకర్.

కొద్దిసేపట్లోనే పెట్టె నిండింది. 'టకప్'లో వున్న మరో పెద్ద మనిషి రైలు కదిలే వేళ ఎక్కి కమలాకర్‌ని ఈర్ష్యతో చూడ సాగాడు. చేతిలో తోలుసంచీ యేదో వుంది.

స్థలం చాలక నుంచున్న మరికొందరు పెద్దమనుష్యులు కాళ్లు పీకడం వల్లనో, చెల్లిస్తున్న హెచ్చు రేట్ల బాధవల్లో, రైల్వే వాళ్లనీ, పడుకున్న వాళ్లనీ, విధినీ అందర్నీ నిందించ సాగారు.

"మిస్టర్! కొంచెం పక్కన కూచోవచ్చా!" అన్నాడు ఆ ఆగంతకుడు.

"నిరభ్యంతరంగా" అన్నాడు కమలాకర్.

ఆయన చేటంత మొహంచేసుకుని, అక్కడ కూర్చొని "ఎందాక?" అన్నాడు.

"మదిర......మీరో?"

"వైజాగ్"

రైలు కదలడంతో జనం రొద కొంచెం తగ్గింది. సమయాంతరాలు సమంగా కలిగిన రైలుధ్వని వింతగా వీనులకు సోకసాగింది.

అంతవరకూ నుంచున్న వాళ్లంతా బెడ్డింగ్‌లపైనా, పెట్టెలపైనా, తమకి తోచిన చోట్ల కూచో సాగారు.

"మొన్న జనగామ దగ్గర జరిగిన రైలు ప్రమాదం గురించి విన్నారా?" అన్నాడాయన.

కమలాకర్ గుండె జలదరించింది. పైకి "వినకేం? విన్నాను. అప్పటి నుంచీ రైలు ప్రయాణమంటేనే అందరికీ హడలుగా వుంది" అన్నాడు.

"ఆ రైల్లో నేనూ వున్నాను!"

కమలాకర్ ఆతురత ఎక్కువైంది.

"మీరా? ఎలా బతికారు?"

"అంతా దైవికం అనుకోండి. ఆలేరులో 'చా' తాగడానికి వెళ్ళాను. రైలు కదిలింది. నా పెట్టె దాటిపోయింది. గత్యంతరం లేక చివరి బోగిలో ఎక్కాను, ఖాజీపేటలో సామాను తీసుకోవొచ్చని. కొంతసేపట్లో వర్షం భోరున కురవసాగింది. అన్ని కిటికీలు మూసేసుకున్నాం. రైలు ప్రకృతితో పోరాటం చేస్తూ ముందుకు మహావేగంతో సాగిపోతోంది. చాలామంది పెట్టెలో నిద్రపోయారు కూడా. నేను ఏదో పత్రిక చదవసాగాను.

"ఉన్నట్టుండి ఆకస్మికంగా పిడుగులు పడినట్లు చప్పుడైంది. మా పెట్టె గట్టిగా కుదిపినట్టయి ఆగిపోయింది. దీపాలు ఆరిపోయాయి. అందరూ ఆ కుదుపుకి కింద పడ్డారు. బయట గాఢాంధకారం; భోరున వర్షం; హోరున గాలి.

"పది హేను నిమిషాల వరకూ ఎవరూ కోలుకో లేదు. సామానులు అవీ నెత్తిమీద పడినవాళ్లు, తదితరులు గోల చెయ్యసాగారు.

"తెగించి నేను మరి కొంతమంది బయట పడ్డాం.

ఏముంది? సముద్రంలా ఎడతెగని ప్రవాహం. పాముల్లా మెరుపుల్లో మెరుస్తోన్న రైలు పట్టాలు. తక్కిన రైలు కనపడలేదు.

"తక్కిన విషయాలు పేపర్లలో చదివే వుంటారు మీరు. నాకు టీ తాగాలని తోచక పోయినా, నా పెట్టె దాటిపోకపోయినా, నా పేరు ఆ మృతజీవుల పట్టికలో చేరేదే".

ఆగాడు. కమలాకర్ కి ఆ ఘోర దృశ్యమంతా కళ్లకు కట్టి నట్టయింది. వొళ్ళు జలదరించింది. కళ్ళు చెమ్మగిల్లాయి. "అదృష్టవంతులు!" అని మాత్రం సణిగాడు.

బయట రైలు వేగంగా పోతోంది. చలిగాలి రైలుతో యుద్ధం చేస్తో, బలవంతంగా లోపలికి వీచసాగింది.

రైలు ప్రయాణీకులు ప్రాణాలన్నీ గుప్పిళ్లల్లో పెట్టుకుని వున్నారు.

"ఇదంతా ఎందుకు చెప్పానో మీరు గ్రహించ లేనట్టుంది" అన్నాడాయన.

కమలాకర్ "మీ అనుభవాన్ని చెప్పారు" అన్నాడు.

"దానితో పూర్తి కాలేదు, నా అనుభవం. చావవల్సిన వాణ్ణి బతికేననే సంతోషంతో బాబు నిజంగా చచ్చివుంటే నా కుటుంబానికి దిక్కేది? అనే బాధ కూడా పీడించసాగింది.

"వెంటనే హనుమకొండలో వున్న ఓ ఇన్సురెన్సు కంపెనీ ఆఫీసుకు వెళ్ళి 20 వేల రూపాయలకు జీవితభీమా చేశాను. ఎందు కనుకున్నారు? నాకోసం కాదు! నా సంతతి కోసం! నా భార్యకోసం! కంపెనీ వాళ్ళు నా తెలివికి ఎంతో మెచ్చు కున్నారు. నన్ను తమ కంపెనీ ఏజంటుగా నియమించారు.

"ఆ గండం గడిచిన నా స్వానుభవం అంతా ముందె ట్టుకుని, మృత్యుగహ్వారం నుంచి బయటపడ్డ నేను మిమ్మల్నొ కటే అడుగదల్చుకున్నాను"

"ఏమిటదీ?"

"మీరు లైఫ్ ఇన్సూర్ చేశారా?"

"లేదు"

"అయితే వెంటనే చెయ్యండి. నేను స్వార్థంకోసం కాదు చెప్పేది. అంతా నిష్కామకర్మ- భగవద్గీతలో చెప్పి నట్టు. ఈ రోజుల్లో జీవితాలు శాశ్వతం కావు. బయటికి వెళ్ళినవాడు ఇంటికి వచ్చే వరకూ నమ్మకం లేదు. అందుకే నామాట వినండి"

కమలాకర్ కి ఇప్పటికి కథ అర్థమైంది. వెంటనే రగ్గు కప్పుకుని నిద్ర నటించ సాగాడు. ★

## గింజలు మిగిలాయి!

దాలయ్య ఫాక్టరీ నించి వొచ్చి, తిన్నెమీద కూచు న్నాడు. పక్కింటి ముసలమ్మ తాళాలు తీసుకొచ్చి ఇచ్చింది, ఇతను రావడం పసిగట్టి.

"అదేదీ?" అన్నాడు దాలయ్య.

"ఏమో, నాతో సెప్పింది కాదు" అంది ముసలమ్మ.

దాలయ్య తలుపు తీసుకొని, బుడ్డి వెలిగించాడు. ఆ మినుకు మినుకు మనే దీపం సాధ్యమైనంత వరకూ చీకటిని తరిమి వేస్తోంది. వస్తువులన్నీ ఎక్కడివక్కడే వున్నాయి.